ఆంధ్రజ్యోతి
రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.32 | సహర్ : 5.00 (సోమవారం)
ANDHRAJYOTHY



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.126	183	208
సూర్యాపేట	రూ.120	180	210
నల్లగొండ	రూ.126	184	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 24.0



లోక్‌సభ ఎన్నికలకు
మోగిన నగారా

» ఏప్రిల్ 18నుంచి నామినేషన్ల ఘట్టం » మే 13న పోలింగ్ » జూన్ 4న కౌంటింగ్, ఫలితాల వెల్లడి
» అమలులోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి » ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం » సమరానికి సై అంటున్న రాజకీయ పక్షాలు

లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్రంలో మే 13న పార్లమెంట్ నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుండగా, జూన్ 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలను ఏడు దశల్లో నిర్వహిస్తుండగా, నాలుగో దశలో రాష్ట్రంలోని 17లోక్‌సభ స్థానాలకు ఎన్నిక లు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలోని రెండో లోక్‌సభ స్థానాలకు మే 13న పోలింగ్ జరగనుంది. నల్లగొండ, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 4, 129పోలింగ్‌స్టేషన్లలో ఈ ఎన్నిక నిర్వహించనున్నారు.నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో 17,18,954 మంది ఓటర్లు, భువనగిరి లోక్‌స భనియోజకవర్గంలో 17,98,704 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వెంట నే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. జూన్ 4వ తేదీ ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యాక ఫలితాన్ని వెల్లడిస్తారు. అప్పటివరకు ఎన్నిక ల కోడ్ అమలులో ఉండటంతో ప్రభుత్వానికి సంబంధించిన అన్ని అధికారిక కార్యక్రమాలకు బ్రేక్‌పడింది.

– (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

వెంటనే ఎన్నికల కోడ్

కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడంతో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలులోకి రావడంతో మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు ఉన్నతాధికారులు అభివృద్ధి కార్యక్రమాల ప్రా రంభాలు, శంకుస్థాపనలను ఎక్కడికక్కడ నిలిపివేశారు. అధికారయంత్రాంగం యావత్తూ ఎన్నికల సంఘం పరిధిలోకి వచ్చింది. పోలింగ్ సిబ్బంది నియామకం, ఎన్నికల నిర్వహణ, పోలీస్ బందోబస్తుకు అవసరమైన బలగాలు సమకూర్చుకోవడం, ఈవీఎం యంత్రాలను సిద్ధం చేయడం వంటి పనులన్నీ ఇప్పటికే పూర్తయ్యాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం పోటీ చేసే అభ్యర్థులు రూ.90లక్షల వ్యయపరిమితికి లోబడి ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా ఓటర్లను ప్రభావితం చేసేలా, ప్రలోభపెట్టేలా ఏ రాజకీయపార్టీ, రాజకీయనేత, అభ్యర్థి వ్యవహరించకూడదు. ఎన్నికల ప్రసంగాల్లోనూ ప్రలోభానికి గురిచేసే హామీలివ్వకూడదు. అంతేకాకుండా కుల, మత వర్గీకరణలు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదని, నేతలు, అభ్యర్థులు మాట్లాడే భాషపై నియంత్రణ ఉండాలని ఎన్నికల కమిషన్ సూచించింది.

సమరానికి సిద్ధమైన రాజకీయపక్షాలు

లోక్‌సభ ఎన్నికల్లో తలపడేందుకు రాజకీయపార్టీలు ఇప్పటికే సన్నద్ధమయ్యాయి. జిల్లాలోని రెండు సీట్లకు బీజేపీ భువనగిరి నుంచి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, నల్లగొండ నుంచి మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అభ్యర్థిత్వాలను ఇప్పటికే ప్రకటించి ఎన్నికల రణరంగంలో ముందంజలో ఉంది. కాంగ్రెస్ తొలి జాబితాలో నల్లగొండ లోక్‌సభ సీటుకు మాజీ మంత్రి జానారెడ్డి తనయుడు కుందూరు రఘువీర్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించగా, భువనగిరి స్థానం నుంచి అభ్యర్థి ఎంపికకు తీవ్ర కసరత్తు చేస్తోంది. బీఆర్‌ఎస్ ఇప్పటివరకు జిల్లాలోని రెండు సీట్లకు అభ్యర్థులను ప్రకటించలేదు. నేడో రేపో ఆ పార్టీ అభ్యర్థుల్ని ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో స్థిరమైన ఓటు బ్యాంకు ఉన్న సీపీఎం ఈ లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి స్థానం నుంచి పోటీ చేస్తుందని, త్వరలో అభ్యర్థిని ప్రకటిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య తెలిపారు. టీఎల్‌ఎఫ్ ఇప్పటికే తమ అభ్యర్థులుగా వస్కుల మట్టయ్య, నూనె వెంకటస్వామిని ప్రకటించింది. సీపీఐ, తెలంగాణ జనసమితి పార్టీలు కాంగ్రెస్‌తో పొత్తులో ఉండడంతో ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లలో ఆ పార్టీ అభ్యర్థులు బరిలో నిలిచే అవకాశం లేదు. బీఎస్పీ తదితర పార్టీలు అభ్యర్థులను నిలబెట్టే అంశంపై సమాలోచనలు చేస్తున్నాయి.

నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం

అసెంబ్లీ నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జండర్	మొత్తం
నల్లగొండ	284	1,20,556	1,27,109	57	2,47,722
దేవరకొండ	308	1,31,599	1,30,241	18	2,61,858
నాగార్జునసాగర్	299	1,15,545	1,20,229	21	2,35,795
మిర్యాలగూడ	263	1,15,352	1,19,956	26	2,35,334
హుజూర్‌నగర్	308	1,21,390	1,28,692	17	2,50,099
కోదాడ	296	1,19,295	1,25,889	17	2,45,201
సూర్యాపేట	271	1,18,510	1,24,422	13	2,42,945
మొత్తం	2029	8,42,247	8,76,538	169	17,18,954

భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం

అసెంబ్లీ నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జండర్	మొత్తం
భువనగిరి	257	1,08,598	1,11,358	1	2,19,957
ఆలేరు	309	1,16,344	1,17,497	19	2,33,860
నకిరేకల్	305	1,25,005	1,27,625	3	2,52,633
తుంగతుర్తి	326	1,28,240	1,29,752	7	2,57,999
మునుగోడు	307	1,27,547	1,28,513	3	2,56,063
జనగామ	277	1,18,929	1,22,207	9	2,41,145
ఇబ్రహీంపట్నం	319	1,69,713	1,67,298	36	3,37,047
మొత్తం	2100	8,94,376	9,04,250	87	17,98,704

ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలకు ఉమ్మడి జిల్లా అధికారిక యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ దాసరి హరిచందన వ్యవహరిస్తుండగా, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల అధికారిగా కలెక్టర్ హన్మంతు కే.జండగే వ్యవహరిస్తున్నారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో విస్తరించి ఉండగా, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం యాదాద్రి, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, జనగామ జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. నల్లగొండ నియోజకవర్గం పరిధిలో 2,029 పోలింగ్ స్టేషన్లకు 17,18,954 మంది ఓటర్లు ఉన్నారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 2,100 పోలింగ్‌స్టేషన్లకు 17,98,704 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్ల జాబితా సవరణ, మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుకు ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ వరకు గడువు ఉండడంతో ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

కోడ్ కూసింది

83 రోజులపాటు పార్లమెంట్ ఎన్నికల కోడ్

» నిలిచిపోనున్న అభివృద్ధి పనులు » 239 రోజుల్లో 138 రోజులు ఎన్నికల కోడ్



తిరుమలగిరిలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

భువనగిరి టౌన్, మార్చి 16: ఎన్నికల కమిషన్ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. శనివారం ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను ప్రకటించిన వెంటనే అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్ జిల్లాలో 83 రోజుల పాటు కొనసాగనుంది. ఈ మేరకు మార్చి 16న నుంచి ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు 83 రోజుల పాటు అమల్లో ఉండనుంది. దీంతో అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం పడనుంది. అయితే ఈపాటికే ప్రారంభమైన పనులను యథావిధిగా కొనసాగించే అవకాశం ఉన్నప్పటికీ నూతన పనులను ఎన్నికల కోడ్ ముగిసే వరకు చేపట్టే అవకాశం ఉండదు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల పాలనలో ఐదు గ్యారంటీ పథకాలను అమలుచేయగా మరిన్ని పథకాలను అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఆగాల్సిందే. అలాగే మునిసిపల్ అవిశ్వాస రాజకీయాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పలు మునిసిపాలిటీల్లో ఇటీవల కొలువుదీరిన నూతన పాలకపక్షాలు పలు పనులను ప్రారంభిస్తామని ప్రకటించినప్పటికీ ఎన్నికల కోడ్‌తో బ్రేక్‌పడింది. కాగా గత అక్టోబరు 9న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌తో అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్ డిసెంబరు 5వరకు కొనసాగిన విషయం తెలిసిందే. దీంతో గత అక్టోబరు 9న ప్రారంభమైన ఎన్నికల కోడ్ నుంచి పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసే 2024 జూన్ 6 వరకు 239 రోజుల్లో 138 రోజులు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నట్లవుతోంది. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో జనగాం నుంచి గెలుపొంది ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఖాళీ అయిన పట్టభద్రుల ఎమ్మెల్సీకి పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఎన్నికల కమిషన్ ఎన్నిక నిర్వహించనుంది. ఈపాటికే ఓటరు జాబితాలు కూడా సిద్ధమయ్యాయి. దీంతో పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మరోమారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రానుంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన మొదటి రోజు శనివారంనుంచే భువనగిరి పట్టణంలో పోలీసులు వాహనాల తనిఖీని ప్రారంభించగా గోడలపై ఉన్న పార్టీల గుర్తులను, పార్టీ పేర్లను తూడ్చడాన్ని అధికారులు ప్రారంభించారు. నాయకుల విగ్రహాలకు, అభివృద్ధి పథకాల శిలాఫలకాలకు ముసుగులు వేస్తున్నారు.

ఎన్నికల కోడ్‌తో తొలిగిన ఫ్లెక్సీలు

తిరుమలగిరి, మార్చి 16: కేంద్ర ఎన్నికల సంఘం శనివారం షెడ్యూల్ ప్రకటించింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం మునిసిపల్ సిబ్బంది తిరుమలగిరిలోని పలు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించారు.

లోక్‌సభ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

భువనగిరి అర్బన్, మార్చి 16: మేలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ కలెక్టర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీజీపీ రవిగుప్తతో కలిసి ఎన్నికల నిర్వహణచారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినందున నిబంధనలు కచ్చితంగా అమలు చేయడంతోపాటు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. 24, 48, 72గంటల్లో చేపట్టాల్సిన పనులు చేయాలని, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్స్, వీవింగ్ టీంలు క్షేత్రస్థాయిలో పటిష్ఠంగా పర్యవేక్షణ చేయాలన్నారు. టోల్‌ఫ్రీ నెం. 1950, కంట్రోల్ రూం, 'సీ' విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను పరిష్కరించి, జిల్లాస్థాయిలో 24గంటలు కంట్రోల్‌రూం పనిచేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్, వల్నరబుల్ మ్యాపింగ్ క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వివరాలు పంపాలన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులలో నిఘా ఏర్పాట్లు చేయాలని, ప్రతీరోజు లిక్కరు అమ్మకాలపై నిఘాపెంచాలన్నారు. 'సువిధ' ద్వారా ఇచ్చే అన్ని రకాల అనుమతులకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు అమలు చేయాలి

కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 16: లోక్‌సభ ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ విధివిధానాలపై ఎస్పీ రాహుల్‌హెగ్డేతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. అధికారులు నిర్దేశించి విధులను సమర్థంగా నిర్వహించాలన్నారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు 6,635 మంది సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. ఎస్పీ రాహుల్‌హెగ్డే మాట్లాడుతూ ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో డీపీఆర్‌వో రమేష్‌కుమార్, డీఈవో అశోక్, డీఈఈ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సామరస్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలి

జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.రాజగోపాల్



పేటలో మాట్లాడుతున్న జిల్లా ప్రిన్సిపల్ జడ్జి రాజగోపాల్

సూర్యాపేట లీగల్, మార్చి 16: ఎలాంటి సమస్య అయినా సామరస్యంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.రాజగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్‌అదాలత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనస్పర్థలు మనుషుల మధ్య సర్వసాధారణమని, వాటిని ప్రశాంత వాతావరణంలో పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వివాహ అనంతరం వేర్వేరుగా ఉంటున్న నాలుగు జంటలను ఒకటి చేశారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్‌అదాలత్ కేసుల పరిష్కారానికి వచ్చిన కక్షిదారులకు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకుడు ఇమ్మడి సోమనర్సయ్య మజ్జిగ ప్యాకెట్లను పంపి ణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి, జిల్లా మొదటి అదనపు జడ్జి ఎన్.అమరావతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోండ్రాల అశోక్, జె.శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

సత్వర సమస్యల పరిష్కారానికి మెగా లోక్ అదాలత్

హుజూర్‌నగర్: సత్వర సమస్యల పరిష్కారానికి మెగా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణంలోని కోర్టు హాల్‌లో మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంతాలు,పట్టింపులతో సాధించేది ఏమీ ఉండదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు చల్లా కృష్ణయ్య, నాగార్జున, సత్యనారాయణ, శ్రీనివాసరావు, కోటిరెడ్డి, గోపాలకృష్ణమూర్తి, శ్రీనివాసు, సురేష్, వెంకటేష్, శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

» రూ.37 కోట్లతో ఐటీఐ కళాశాల మంజూరు » పనులపై హైదరాబాద్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, మార్చి 16: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో గల మంత్రి ఉత్తమ్ ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. హుజూర్‌నగర్‌లో రూ. 37కోట్లతో ఐటీఐ కళాశాల మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిర్మాణానికి 10ఎకరాల స్థలం సేకరించాలని అధికారులను ఆదేశించారు. స్థల సేకరణ అనంతరం పనులు చేపడతామన్నారు. హుజూర్‌నగర్, కోదాడలో రెండు రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వీటికోసం 20 ఎకరాల స్థలం సేకరిస్తామన్నారు. రెండు నియోజకవర్గాలలో కొత్తగా ఏర్పాటైన మండలాలకు కొత్త భవనాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రెడ్లకుంట వద్ద చెక్‌డ్యామ్ నిర్మించనున్నట్లు వివరించారు. తాగునీటి ఎద్దడి నివారణకు ఎస్‌డీఎఫ్, డీఎంఎఫ్‌టీ, 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, డీఎంఎఫ్‌టీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ నిధులతో రోడ్లు, బ్రిడ్జీలు, డ్రైన్లు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపా రు. చెరువులలో పూడికలు తీసే పనులు చేపట్టాలన్నారు. పులిచింతల బ్యాక్ వాటర్ ద్వారా తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ఇతర పార్టీల కార్యకర్తలను కాంగ్రెస్‌లో చేర్చుకోవాలని, పార్టీలో చేరికలను స్థానిక నాయకులు వ్యతిరేకించవద్దన్నారు. కాగా పార్టీ పదవులు, స్థానిక సంస్థల పదవులు, నామినేటెడ్ పదవులలో మొదటి నుంచి పార్టీలో ఉండి కష్టపడిన వారికి ప్రాధాన్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీలు గూడెపు శ్రీనివాస్, గోపాల్, సాముల శివారెడ్డి, దొంగరి వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, తన్నీరు మల్లికార్జున్‌రావు, చావా కిరణ్మయి, సహదేవరావు, అరుణ్‌కుమార్, వీరారెడ్డి, ఆశా, ఎంపీపీ మల్లెల రాణి బ్రహ్మయ్య, జడ్పీటీసీ కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

● కవిత అరెస్ట్‌పై బీఆర్‌ఎస్ నిరసన



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసనలు, ఆందోళనలు నిర్వహించారు. ● 8లో..

గోవర్ధనగిరిధారిగా నృసింహుడు

» వైభవంగా తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు
» సాయంత్రం సింహారూఢుడిగా తిరువీధుల్లో విహారం ● 7లో..



సకాలంలో పౌష్టికాహారం అందించాలి

ఐసీడీఎస్ సీడీపీవో కిరణ్మయి



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో కిరణ్మయి

పెన్‌పహాడ్, మార్చి 16: బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో కిరణ్మయి అన్నారు. మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లల్లో పోషక ఆహారం లోపంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. బరువు తక్కువగా ఉండటం, ఎదుగుదల లేకపోవడంలాంటి సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. ఈ విషయంలో అంగన్‌వాడీ టీచర్లు జాగ్రత్తలు వహించి, వారికి సకాలంలో పౌష్టికాహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చైతన్య, తేజస్విని, కృష్ణ, వెంకటమ్మ, జాన్సీ, వినోద్, భవ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భావోద్వేగాలను రెచ్చగొడుతున్న బీజేపీ

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

సూర్యాపేటటౌన్, మార్చి 16: కేంద్ర ప్రభుత్వం తాము అనుకున్న లక్ష్యాలను సాధించడంకోసం ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతోందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రోరల్ బాండ్‌ల వ్యవహారంలో అవినీతి బురదలో బీజేపీ ప్రభుత్వం చిక్కుకుందన్నారు. ఎన్నికల ఫండ్ పేరుతో సాగించిన మనీ ల్యాండరింగ్ సహా బీజేపీ ప్రభుత్వ అనేకఅక్రమాలు వెలుగులోకి వస్తున్నాయని విమర్శించారు. కనీసం రూ.100 కోట్ల టర్నోవర్ కూడా లేని కంపెనీకి రూ.200కోట్ల నిధులు కేటాయించడం, కనీసం కంపెనీ వెబ్‌సైట్ లేని అనేక కంపెనీలకు నిధులు అక్రమంగా మళ్లించారని తెలిపారు. దేశంలో బీజేపీతో పాటు టీడీపీ, జనసేన వంటి పార్టీలు అవినీతిలో కూరుకుపోయాయని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు,ఉస్తేల నారాయణరెడ్డి, యల్లావుల రాములు, మేకల శ్రీనివాసరావు, యల్లంల యాదగిరి, ధనుంజయనాయుడు, శ్రీనివాస్, పోకల వెంకటేశ్వర్లు, మల్లీశ్వరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తప్పతాగి.. ఇంటికి నిప్పుపెట్టి

- తల్లిపై దాడి
- అడ్డుకున్న స్థానికులకు బెదిరింపు

ఆత్మకూర్(ఎస్), మార్చి 16: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని తల్లిపై దాడికి యత్నించాడో కుమారుడు. ఆమె తప్పించుకోవడంతో కోపంతో ఇంట్లోని దుస్తులకు నిప్పంటించి, ఇల్లు తగులబెట్టాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిలుకూరి బాలయ్య, ఉప్పలమ్మల కుమారుడు విక్రమ్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా వివాహం కాలేదు. తండ్రి బాలయ్య చర్చి పాస్టర్ కాగా, ఉప్పలమ్మ కూలిపనులు చేస్తుంది. మద్యానికి బానిసైన విక్రమ్ మద్యం డబ్బుల కోసం తరుచూ తల్లిదండ్రులను వేధించేవాడు. విక్రమ్ రెండు రోజులుగా మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని తల్లిని వేధిస్తున్నాడు. శనివారం కూడా డబ్బులు ఇవ్వాలని తల్లిపై దాడికి యత్నించగా ఆమె తప్పించుకుంది. ఆ కోపంతో మద్యం మత్తులో ఉన్న విక్రమ్ తన ఇంట్లోని బీరువాలో తల్లి దుస్తులు తీసి తగలబెట్టి తలుపులు పె ట్టాడు. ఆ మంటలు ఇంటికి అంటుకొని ఇంట్లో సామానుతో పాటు దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పేందుకు రాగా విక్రమ్ గ్రామస్థులను బెదిరించాడు. గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న సామాన్లు, దుస్తులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఇంటి నుంచి మంటలు రావడంతో విక్రమ్ అక్కడినుంచి పారిపోయాడు.



ఇంటి నుంచి వస్తున్న మంటలు

భక్తవత్సలా.. పాహిమాం

● లక్ష్మీనృసింహుడి సన్నిధిలో వైభవంగా తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ● ఉదయం గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చిన నృసింహుడు ● రాత్రికి సింహరూఢుడిగా తిరువీధుల్లో విహారం

యాదగిరిగుట్ట, మార్చి 16: మహిమాన్విత దివ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీనాథుడు నృసింహుడు శనివారం 'గోవర్ధన గిరిధారి'గా శ్రీకృష్ణుడి అలంకరణలో పెళ్లి కొడుకుగా సేవలు అందుకోగా భక్తులు దర్శించుకుని తరించారు. ప్రధానాలయ ప్రాకార మండపంలో స్వామివారిని పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా గోవర్ధనగిరిధారి అలంకరణలో తీర్చిదిద్దిన సేవలో అధిష్ఠింప జేశారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రధానాలయ తిరువీధుల్లో అలంకార సేవను ఊరేగింపు నిర్వహించిన ఆచార్యులు తూర్పు రాజ గోపురం ముందు వేదికపై తీర్చిదిద్దారు. అర్చకులు, వేదపండితులు, రుత్విక స్వాములు అలంకారసేవ ముందు వేదిపారాయణ పఠనం జరిగింది. వైదిక పర్వాలు దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహచార్యులు, కాందూరి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో కొన సాగాయి. కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఇన్‌చార్జి ఈవో ఎం. రామకృష్ణారావు పాల్గొన్నారు.

ప్రత్యేక ఘట్టం

భక వత్సలా!.. శ్రీకృష్ణా ప్రభూ.. మమ్ములను రక్షింపనీవే సమర్థుడవు.. పాహిమాం ప్రభూ.. అంటూ గోపాలురులు స్వామివారిని వేడుకోగా జీవులను, వేదములను, ఇంద్రియములను సంరక్షించడం కోసం తన మహిమలను లోకానికి చాటిన ప్రత్యేక ఘట్టం గోవర్ధనగిరిధారి అలంకారం. పట్టు పీతాంబురాలు, చేతిలో పిల్లన గ్రోవి.. ఎడమచేతి చిటికెన వేలిపై గోవర్ధన పర్వతాన్ని స్వామి ధరించి తీరును అద్భుతమని, ద్వాపర యుగంలో నందుడి రాజ్యాన్ని అల్లకల్లోలం చేసేందుకు ఇంద్రుడి ఆజ్ఞ మేరకు అగ్నిదేవుడు కురిపించిన నిప్పుల వర్షం నుంచి గోకులాన్ని రక్షించిన తీరులో యాదాచలేశుడు తన ఆపన్న హస్తాలతో యావత్ భక్తజనావళిని రక్షిస్తున్నాడని అలంకార సేవ వైభవాన్ని ఆచార్యులు భక్తులకు వివరించారు.

సింహరూఢుడిగా తిరువీధుల్లో విహారం

దుష్ట శిక్షణ..శిష్ట రక్షణకు నృసింహుడిగా అవతరించిన స్వామివారు మృగరాజు సింహవాహనంపై భక్తుల పూజలు అందుకున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో రాత్రి వేళ దివ్యవాహన సేవలు అందు కోవ డం ఆలయ సంప్రదాయం. దివ్యాభరణలతో తేజో రూపుడైన నారసింహు డు అటవికే మహారాజైన సింహవాహనంపై అధిష్టించి దర్శనమిచ్చారు. .

శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ప్రభాతభేరి

స్థానిక శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతవేళ ప్రభాతభేరి కార్యక్రమం కొనసాగాయి. శ్రీవైష్ణవస్వాములు, రుత్వికులు లక్ష్మీనృసింహుడి కరావలంబ స్తోత్రం, విష్ణు సహస్రనామ పఠనాలతో తిరువీధుల గుండా ప్రదక్షిణంగా ప్రధానాలయంలోనికి చేరుకున్నారు. గర్భాలయంలోని స్వయంభువుల సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టారు.


సింహవాహన అలంకార సేవోత్సవం


సేవోత్సవంలో పాల్గొన్న చైర్మన్ నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు

ప్రసాదాల తయారీ పరిశీలన

యాదగిరీశుడి పులిహోర ప్రసాదంలో ఎలుక ప్రత్యక్షమైనట్టు వచ్చిన వార్తలకు స్పందిస్తూ ప్రసాదాల తయారీని దేవాదాయశాఖ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణవేణి శనివారం పరిశీలించారు. ప్రసాదాల తయారీ, ప్యాకింగ్ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పులిహోర ప్రసాదం తయారీ మొత్తం యంత్రాల ద్వారా జరిగినా ప్యాకింగ్ మాత్రం శ్రీవైష్ణవ, బ్రాహ్మణ వంటస్వాములచే నిర్వహిస్తున్నట్టు గుర్తించినట్టు, నివేదిక అందజేయనున్నట్టు దేవస్థాన అధికారులు పేర్కొన్నారు.

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీసాయిశ్రీనివాస భజన మండలి, శ్రీభక్తరామదాసు భజన మండలి, బూడిద సత్తయ్యబృందంలచే భక్తి భజనలు, వింజమూరి విజయకుమారాచార్యులచే నృసింహతత్వంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం, పాల రామాంజనేయ భాగవతార్‌చే సీతాకల్యాణం హరికథా కాలక్షేపాలు, సాయంత్రం మహతీ ఆర్ట్స్ బృందంచే భక్తి సంగీత విభావరులు, భ్రమరాంబ, నాగదుర్గ, శ్రీసురభి అకాడమి ఆఫ్ పర్ఫార్మింగ్, కుమారి అంకం శిరీష, లాస్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఇతర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

స్వామివారి ఎదుర్కోళ్లు.. కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో విశేష ఘట్టాలైన స్వామి, అమ్మవార్ల ఎదుర్కోళ్లు మహోత్సవం, తిరుకల్యాణోత్సవాల నిర్వహణ కోసం దేవస్థాన అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ప్రధానాలయ తూర్పు పంచతల రాజగోపురం ముందు గోల్డెన్ క్యూలైన్ ప్రాంతంలో స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు వేడుకలను నిర్వహించేందుకు వేదికను . కాగా ఆదివారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవ వైదిక పర్వాలు సంప్రదాయరీతిలో కొనసాగనున్నాయి.

యాదగిరికొండపై భక్తుల సందడి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దేవదేవుడి దర్శనాల కోసం క్యూలైన్లలో బారులు తీరారు. భక్తుల సంచారంతో కొండకింద కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, బస్‌స్టాండ్‌లు, కొండపైన ఆలయ తిరువీధులు, ఉభయ దర్శన క్యూలైన్లు, ప్రధానాలయం, ప్రసాదాల విక్రయశాల తదితర ప్రాంతాలు కోలాహలంగా కనిపించాయి. ధర్మదర్శనాలకు రెండు గంటలు, ప్రత్యేక దర్శనాల్లో గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 20వేల మంది యాదగిరిక్షేత్రాన్ని సందర్శించుకున్నారని, వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.24,22,074 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. స్వామికి నిత్య పూజలు ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. వేకువజామున సుప్రభాతం, బిందెతీర్థంతో నిత్యారాధనలు ఆరంభించిన ఆచార్యులు రాత్రి వేళ శయనోత్సవ పర్వాలతో ఆలయ ద్వార బంధనం చేశారు. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వర స్వామికి, ముఖమండపంలో స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్యరుద్ర హవనం, కొండకింద వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రత పూజలు శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. స్వామిని హైకోర్టు అడ్వకేటు జనరల్ ఎ సుదర్శన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలనంతరం ఆశీర్వచనం నిర్వహించారు.



రెండు గ్రామాల మధ్య చేపల చెరువు వివాదం

● చేపలు పట్టుకునే హక్కు ఇవ్వాలంటున్న సింగారం గ్రామస్థులు, ● మత్స్య సహకార సంఘం తమ గ్రామ పరిధిలో ఉందంటున్న చాడ గ్రామస్థులు


ఆత్మకూరు(ఎం) మార్చి 16: యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని సింగారం గ్రామస్థులు, మోటకొండూరు మండలం చాడ గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యుల మధ్య చెరువులో పెంచిన చేపలు పట్టే విషయంలో వివాదం నెలకొంది. తమ గ్రామానికి చెందిన చెరువులోని చేపలు పట్టుకుంటామని సింగారం గ్రామస్థులు, మీకు హక్కు లేదని చాడ గ్రామానికి చెందిన మత్స్యకారుల మధ్య పంచాయితీ కొనసాగుతోంది. రెండు గ్రామాల మత్స్యకారుల వాదన ప్రకారం... మండలంలోని సింగారం గ్రామంలోని బండ చెరువులో మూడేళ్ల క్రితం ప్రభుత్వం చేప పిల్లలు వదిలింది. సింగారం బండ చెరువు చాడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పరిధిలో ఉంది. మూడేళ్లుగా మత్స్యకారులు చేపలు పట్టలేదు. చాడ గ్రామానికి చెందిన కొందరు మత్స్యకారులు మాస్కులు ధరించి, కర్రలతో ఈ నెల 12వ తేదీ రాత్రి సింగారం వచ్చారని గ్రామస్థులు అన్నారు. వారిని పట్టుకొని అదే రాత్రి గ్రామపంచాయతీ వద్దకు తీసుకొచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చి అప్పగించామని గ్రామస్థులు తెలిపారు. తాము చెరువు కాపలా కోసం వస్తే పట్టుకొని గ్రామపంచాయతీ కార్యాలయంలో బంధించారని చాడ గ్రామ మత్స్యకారులు సింగారం గ్రామస్థులపై కేసు పెట్టారు. ఏడుగురిపై కేసు నమోదు చేశారు. దీంతో చేపలు పట్టే విషయంలో వివాదం మరింత ముదిరింది.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సింగారం గ్రామస్థులు

మా చెరువులో చేపలు పట్టుకునే హక్కు మాకే ఇవ్వాలి

తమ ఊర్లోని చెరువులో చేపలు పట్టుకునే హక్కు మాకే ఇవ్వాలని సింగారం గ్రామస్థులు డిమాండ్ చేశారు. సుమారు 30మంది గ్రామస్థులు శనివారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని తమ గ్రామస్థులపై కేసులు ఎందుకు పెట్టారని ఎస్‌ఐ నాగరాజును ప్రశ్నించారు. గ్రామానికి వచ్చిన వ్యక్తులను గ్రామపంచాయతీ కార్యాలయంలో బంధించే హక్కు లేదని ఎస్‌ఐ వారితో అన్నారు. అనంతరం గ్రామస్థులు తహసీల్దార్‌కార్యాలయం ఎదుట కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఎలాంటి వనరులు లేవని, చేపలు అమ్ముకునే హక్కు తమకే కల్పించాలని డిమాండ్ చేశారు. తమ ఊరి చెరువులో పెంచిన చేపలను పక్క ఊరి వారు పట్టుకుపోతామంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. మా ఊరి చెరువుపై హక్కులు కల్పించే వరకు పోరాడుతామన్నారు. ఎస్‌ఐ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ సఫియోద్దీన్ గ్రామపెద్దలకు నచ్చజెప్పె ప్రయత్నం చేసినా ఒప్పుకోలేదు. ఎస్‌ఐ, డీటీలు ఈ విషయాన్ని జిల్లా మత్స్యశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లగా చెరువులో చేపలు పట్టుకునే హక్కు మత్స్యకారులకు మాత్రమే ఉంటుందని గ్రామస్థులకు ఉండదని, ఈ విషయంపై గురువారం మాట్లాడుదామని చెప్పడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సఫియోద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు.

వైద్యం వికటించి బాలుడు మృతి


రితిక్‌సిద్ధార్థ మృతదేహం

హుజూర్‌నగర్, మార్చి 16: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం వికటించి శనివారం బాలుడు మృతిచెందాడు. తల్లిదండ్రులు, బంధువులు ఆసుపత్రి ఎదుట బాలుడి మృతదేహంతో ధర్నాకు దిగారు. డాక్టర్ నిర్లక్ష్యంతోనే బాలుడు మృతిచెందాడని ఈ సందర్భంగా తల్లిదండ్రులు ఆరోపించారు. ఆసుపత్రి ఎదుట ధర్నా చేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాగా కొద్దిసేపు ఆసుపత్రి ఎదుట ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే పెద్దమనుషులు సంఘటన స్థలానికి చేరుకుని బాలుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన లొడంగి సాయికృష్ణ, శిరీష దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా పెద్దకుమారుడు లొడంగి రితిక్‌సిద్ధార్థ(5) విరేచనాలతో బాధపడుతుండగా బాలుడి తల్లిదండ్రులు ఆర్‌ఎంపీని సంప్రదించగా హుజూర్‌నగర్‌కు తీసుకెళ్లాలని ఆర్‌ఎంపీ సూచించారు. దీంతో శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం రితిక్‌సిద్ధార్థ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాలుడి తండ్రి సాయికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

మద్యం మత్తులో ఆటో డ్రైవర్ బీభత్సం

భువనగిరి టౌన్, మార్చి 16: మద్యం మత్తులో డ్రైవర్ శనివారం రాత్రి భువనగిరిలో బీభత్సం సృష్టించాడు. స్థానిక తారకరామానగర్‌కు చెందిన వెంకటేష్ మద్యం సేవించి నడుపుతున్న ఆటో అదుపు తప్పి నల్లగొండ రోడ్డు వెంట గల శివనగర్‌లో రోడ్డు పక్కనే బైక్ ఆపి మాట్లాడుతున్న గాంధీనగర్‌కు చెందిన ఏ భానుపైకి దూసుకెళ్లింది. దీంతో భాను కాళ్లు విరిగాయి. అదే వేగంతో పక్కనే కుమ్మరివాడలోని రహదారి వెంట విక్రయానికి ఉంచిన కుండలపైకి దూసుకెళ్లింది. ఆటోను గమనించిన కుండల వ్యాపారి మరికొండ కవితతో పాటు కుండలు కొంటున్న మరో ఇద్దరు అప్రమత్తమై పరుగులు తీశారు. దీంతో పెను ముప్పు తప్పింది. అక్కడున్న యువకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన భానును జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ధ్వంసమైన కుండలు

చికిత్సపొందుతూ ఇద్దరు మృతి

వలిగొండ, చిట్యాల, మార్చి 16: చికిత్సపొందుతూ ఇద్దరు మృతిచెందారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని మునగాల తుర్కపల్లి గ్రామానికి చెందిన బద్దం యాదమ్మ(70) పేరుమీద ఉన్న మూడెకరాల వ్యవసాయ భూమిని పెద్ద కోడలు స్వరూప, ఆమె మనుమడు రామిరెడ్డి పేర్ల మీదకు మార్చాలని మార్చి 12న కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. వృద్ధురాలిని మోత్కురులో తన కుమార్తె సువర్ణ ఇంటికి తీసుకెళ్లారు. 15వ తేదీ శుక్రవారం రాత్రి యాదమ్మ తీవ్ర అస్వస్థతకు గురి కాగా మోత్కూరులో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి మృతిచెందిదని ఎస్‌ఐ మహేందర్‌లాల్ తెలిపారు. యాదమ్మ చిన్న కుమారుడు మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. నల్లగొండ జిల్లా చిట్యాల శివారులోని ఓ దాబహోటల్ వద్దకు ఈ నెల 14వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి భోజనం చేయడానికి వచ్చాడు. భోజనం చేస్తూ మూర్ఛ వ్యాధికి గురై కుర్చీలో నుంచి కింద పడిపోయాడు. చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

చదువుకు తగిన ఉద్యోగం రాలేదని ఆత్మహత్య


నాగరాజు(ఫైల్)

నల్లగొండ టౌన్, మార్చి 16: చదువుకు తగిన ఉద్యోగం రాలేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన గోలి వెంకన్న ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుండగా, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు గోలి నాగరాజు(25) 2022లో బీటెక్ పూర్తిచేసి స్థానికంగా ఓ కారు షోరూంలో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడు. సున్నిత మనుస్కుడైన నాగరాజు తన చదువుకు తగిన ఉద్యోగం రాలేదని, భవిష్యత్‌లో కుటుంబాన్ని ఎలా పోషించాలని స్నేహితుల వద్ద బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో నాగరాజు శుక్రవారం సాయంత్రం పట్టణంలోని రాక్‌హిల్స్ కాలనీ వెనకాల గల గ్రీన్‌హిల్స్ కాలనీ సమీపంలో పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని తన స్నేహితులకు ఫోన్ చేసి చెప్పాడు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకోగా అపస్మారకస్థితిలో ఉన్నాడు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. నాగరాజు తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. చిన్న కుమారుడు పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు.

గడ్డి మందు తాగి యువకుడు..


మహిపాల్‌రెడ్డి(ఫైల్)

మోత్కూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామానికి చెందిన నేవూరి నర్సిరెడ్డి, మాయమ్మ దంపతుల కుమారుడు నేవూరి మహిపాల్‌రెడ్డి(24) ఈ నెల 15న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతన్ని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడని ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మహిపాల్‌రెడ్డికి ఫిట్స్ వ్యాధి ఉండడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని మేనమామ రాజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

చిట్యాల, గరిడేపల్లి, మార్చి16: నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. కరీంనగర్ జగిత్యాలకు చెందిన వనం రాములు(48) నల్లగొండ జిల్లా చిట్యాలలో ఉంటున్న తన కూతురిని చూడడానికి ఆయన భార్య వెంకటమ్మతో కలిసి చిట్యాలకు వచ్చాడు. టీ తాగుతానని శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చిన అతడు భువనగిరి రోడ్‌లో గల పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటుతుండగా చిట్యాల నుంచి భువనగిరి వైపు వెళుతున్న డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రాములు అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు. రాములు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా చిట్యాల జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్యాపేట మండలంలోని సోలిపేట గ్రామానికి చెందిన తలారి రవి(30) మృతిచెందాడు. బైక్‌పై సూర్యాపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా చిట్యాల రైల్వేస్టేషన్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రవి అక్కడికక్కడే మృతిచెందాడు. రోడ్డు ప్రమాదంతో హైవేపై కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ అయింది.

మూలమలుపు వద్ద

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం మర్రికుంట గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మఠంపల్లి మండలం బిల్యానాయక్ తండాకు చెందిన ధరవత్ నవీన్(21) సొంత పనుల నిమిత్తం గరిడేపల్లి నుంచి సూర్యాపేట వెళుతుండగా మండల పరిధిలోని మర్రికుంట గ్రామ సమీపంలో గల మూలమలుపు వద్ద రాగానే సూర్యాపేట నుంచి గరిడేపల్లి వైపు వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ధరావత్ నవీన్‌కు తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు 108కు ఫోన్ చేయగా క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో హుజూర్‌నగర్ ఏరియా హాస్పటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ విషయంపై పోలీసులను సమాచారం కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

మోతె: సూర్యాపేట జిల్లా మండల పరిధిలోని రాఘవాపురం క్రాస్‌రోడ్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, 108సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకేంద్రానికి చెందిన వి. అఖిల్ అతని స్నేహితుడు గోపీచంద్ కలిసి ఖమ్మం నుంచి బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. రాఘవాపురం క్రాస్‌రోడ్ వద్ద ఉన్న ఫ్లైఓవర్ దిగుతుండగా వెనకాల నుంచి వస్తున్న హుస్సేనాబాద గ్రామానికి చెందిన ధన్యం లోడుతో సూర్యాపేటకు వెళుతున్న ట్రాక్టర్ బైక్ వెనకాల ఢీకొట్టడంతో రోడ్డు పక్కన పడిపోయారు. బైక్ ధ్వంసం కాగా అఖిల్ కాలు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గోపిచంద్ తలకు నడుముకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సిబ్బంది సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. ధ్వంసమైన బైక్‌ను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కవితను అరెస్టు చేయడం దారుణం

● సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ ● బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు

సూర్యాపేట టౌన్, మార్చి 16: ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం దారుణమని మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, బీఆర్ఎస్ నాయకుడు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నల్లజెండాలతో నిరసన తెలిపి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపుకు భయపడి బీజేపీ, కాంగ్రెస్ అక్రమ అరెస్టులకు తెరలేపిందని ఆరోపించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ పుట్ట కిశోర్, ఆకుల లవకుశ, ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం, బూర బాలసైదులుగౌడ్, అనిల్‌రెడ్డి, కక్కిరేణి నాగయ్య, రఫీ, నాగభూషణం, చౌక్కయ్య, సుంకరి రమేష్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: ఎమ్మెల్సీ కవిత అరెస్టు రాజకీయ కక్ష సాధింపు చర్య అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి అన్నారు.



హుజూర్‌నగర్‌లో మోదీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కోదాడలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కవిత అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలో ఆందోళన చేపట్టారు. ప్రధాని మోదీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ స్నేహలత, మాజీ ఎంపీపీ సతీష్, దూపటి రవి, పాష, శ్రీధర్, నరేష్, త్రిశూల్ పాల్గొన్నారు.

మద్దిరాల: ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా మద్దిరాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలు నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎస్ఏ రజాక్, బెజ్జంకి శ్రీరాంరెడ్డి, మారెల్లి యాకయ్య, సూరినేని నర్సింహారావు, వెంకన్న, నర్సయ్య, ఉప్పలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): కవిత అరెస్టును నిరసిస్తూ మండలంలోని నెమ్మికల్ రోడ్డుపై బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సూర్యాపేట దంతాలపల్లి ప్రధాన రహదారిపై గంట పాటు ట్రాఫిక్ నలిచింది. తదనంతరం ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూడి నరసింహారావు, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, మర్ల చంద్రారెడ్డి, ముద్దం కృష్ణారెడ్డి, బత్తుల ప్రసాద్, వెంకటరెడ్డి, మల్లారెడ్డి, శ్రీను పాల్గొన్నారు.



తిరుమలగిరిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూర్‌నగర్: పట్టణంలోని ఇందిర సెంటరులో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేశారు. అనంతరం మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కొప్పుల సైదిరెడ్డి, జక్కుల నాగేశ్వరరావు, ముల్కలపల్లి రాంబాబు, అమర్‌గౌడ్, వెంకటరెడ్డి, కవిత, కామిశెట్టి వెంకటేశ్వర్లు, జక్కుల వీరయ్య, నాగయ్య, శ్రీధర్, కృష్ణానాయక్, సత్యనారాయణరెడ్డి, అశోక్, జగన్‌నాయక్, ఉపేందర్‌యాదవ్, నగేష్‌నాయక్, రంగాచారి, పరశురాములు, ధనమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, షఫీ, కృష్ణంరాజు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని పలువురు బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కవిత అరెస్టును నిరసిస్తూ కోదాడలోని ఖమ్మం క్రాస్ రోడ్డులో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించి, అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బెజవాడ శ్రావణ్, తాళ్లూరి శ్రీనివాస్, మామిడి రామారావు, అల్వాల వెంకట్, శెట్టి సురేష్, నాయుడు కొమరగిరి గోపాలకృష్ణ, ములుగూరి నాగరాజు, పిట్టల భాగ్యమ్మ, గంధం పాండు, కార్ల సుందర్ బాబు, అక్కినపల్లి జానకి రామాచారి, మాజీ సర్పంచ్ కోటేష్, సంగిచెట్టు గోపాల్, దిలీప్, వీరబాబు, బాబురావు, భిక్షం, అంబేద్కర్, మోజన్, వెంకటప్పయ్య, శ్రీనివాస్ నాయక్, అన్నపాక కోటేష్, పాల్గొన్నారు.

మెడికోకు కాకతీయ సేవా సమితి చేయూత



చెక్కును అందజేస్తున్న కాకతీయ సేవా సమితి నాయకులు

కోదాడ టౌన్, మార్చి 16: మెడికో పిడమర్తి రంజిత్‌కు కాకతీయ సేవా సమితి నాయకులు ఆర్థికసాయం అందజేశారు. వేరేపల్లి లక్ష్మీనారాయణ రావు పంపించిన రూ.లక్ష చెక్కును శనివారం పట్టణంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు ఇంట్లో నిర్వహించిన సమా వేశంలో మెడికో రంజిత్ తల్లిదండ్రులు లక్ష్మి, గాంధీకి కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు పెద్దనాటి వెంకటేశ్వరరావు, రావిళ్ల సీతారామయ్య, మునిసిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల రమేష్, ముత్తవరపు పాండు రంగారావు అందజేశారు. కార్యక్రమంలో కాకతీయ సేవా సమితి ప్రధాన కార్యదర్శి వి.సురేష్, పి.రంగారావు, మాధవరావు, కనగాల నాగేశ్వరరావు, గంటా సత్యనారాయణ, కొత్త బ్రహ్మయ్య, సామినేని రమేష్ సురేష్ మేకల వెంకట్రావు, కాకర్ల వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

సామాజిక సేవలో లయన్స్ క్లబ్ ముందుండాలి

నేరేడుచర్ల, మార్చి 16: సామాజిక సేవలో నేరుడుచర్ల లయన్స్ క్లబ్ ముందుండాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సీహెచ్ శివప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని వైకుంఠాపురం, ఫత్తేపురం గ్రామ పంచాయతీలకు దాత రావులపల్లి ప్రసాద్ రూ.70వేల వ్యయంతో ఫ్రీజర్ బాక్స్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గరిడేపల్లి ప్రాథమిక పాఠశాల కోసం మైక్ సెట్‌ను ఆ పాఠశాల ఉపాధ్యాయుడు బాలసైది రెడ్డికి లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు యడవెల్లి సత్యనారాయణరెడ్డి అందజేశారు. దివ్యాంగుడికి ట్రైసైకిల్‌ను లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు కందిబండ శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో మధు, కొణతం సీతారాంరెడ్డి, చల్లా ప్రభాకర్‌రెడ్డి, రావులపల్లి ప్రసాద్, పోరెడ్డి శ్రీరాంరెడ్డి, కె.శ్రీనివాసరావు, సుంకర క్రాంతికుమార్ పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు వాటా కల్పించాలి

తిరుమలగిరి, మార్చి 16: చట్టసభల్లో బీసీలకు వాటా కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు కోరారు. చట్టసభల్లో బీసీలకు వాటా కల్పించాలని కోరుతూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శనివారం తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు కార్యక్రమంలో సాయి నరేందర్, బత్తుల సిద్ధేశ్వర్, నరేంద్రగౌడ్,పాల్గొన్నారు.

బీజేపీకి చలిగంటి ప్రమీల రాజీనామా

కోదాడ, మార్చి 16: బీజేపీకిమహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చలిగంటి ప్రమీల రాజీనామా చేశారు. శనివారం కోదాడలో ఆమె మాట్లాడుతూ బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా రెండేళ్ల నుంచి అంకితభావంతో పనిచేశానన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలపై బీఆర్ఎస్ నాయకులు కేసులు పెట్టించి, తీవ్రంగా కొట్టించి 40నుంచి 50రోజుల వరకు జైల్లో పెట్టించారన్నారు. తమ సంప్రదించకుండా బీజేపీలోకి బీఆర్ఎస్ నాయకులను చేర్చుకోవడంతో బీజేపీ కార్యకర్తలు మనోవేదనతో ఉన్నారన్నారు. తాను కూడా ఆవేదనతో బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రాజీనామా లేఖను ఆమె చూపి, ఈ లేఖను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి అందజేస్తానన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

చిలుకూరు, మార్చి 16: విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మిట్స్ కళాశాల కరస్పాండెంట్ మధిర ప్రీతిరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని మిట్స్ ఫార్మసీ కళాశాలలో మెడ్‌ప్లస్ కంపెనీ వారు మెగా జాబ్‌మేళా 24మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ గౌతంరెడ్డి, ఫార్మసీ కళాశాల డీన్ రాము, ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

నూతన్‌కల్, మార్చి16: మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలో శనివారం పిచ్చి కుక్క కరవడంతో గ్రామానికి చెందిన అనంతుల వీరయ్య, బాణాల శ్రీనివాస్‌రెడ్డి, అనంతుల కృష్ణయ్యకు గాయాలయ్యాయి. ఈ ముగ్గురినీ చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. పిచ్చి కుక్కను గ్రామస్థులు చంపేశారు.

పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం ఎనలేనిది

నేరేడుచర్ల, మార్చి 16: భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం పోరాడి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం ఎనలేనిదని వాసవీ క్లబ్ అధ్యక్షుడు గెల్లి లక్ష్మీనరసింహారావు, వనితా క్లబ్ అధ్యక్షురాలు గెల్లి లక్ష్మీప్రసన్న అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం నేరేడుచర్లలోని ప్రధాన కూడలి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం పండ్లు, ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జూలూరి అశోక్, చెరుకు కవిత, తాళ్లూరి శ్రీనివాస్, గరిణె జ్యోతి, కొత్త లక్ష్మణ్, వీరవెల్లి శ్రీలతకోటేశ్వరావు, రాచకొండ శ్రీనివాసరావు, కందిబండ శ్రీనివాసరావు, ఊట్కూరి నటరాజు, పాల్వాయి గోపాలకృష్ణ, టి.పరమేశం పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి: జూలకంటి

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 16: పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. శనివారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. మోదీ మరోసారి అధికారంలోకి వస్తే దేశాన్ని సర్వనాశనం చేస్తారన్నారు. కాంట్రాక్టర్లు, బడా పారిశ్రామిక వేత్తలకు దోచి పెడతారని, భారత రాజ్యాంగాన్ని మార్చే ప్రమాదం ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే బీజేపీని ఓడించాలన్నారు. గవర్నర్లు, సెంట్రల్ బ్యూరో డైరెక్టర్లు, ఈడీలో ద్వారా ప్రతిపక్షాలను భయపెడుతున్నారన్నారు. సమావేశంలో పల్లె వెంకటరెడ్డి, శీలం శ్రీను, వట్టెపు సైదులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

కోదాడ టౌన్, మార్చి 16: పట్టణంలోని కోదండ రామాలయ పునర్నిర్మాణం సందర్భంగా విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలను శనివారం ప్రారంభించారు. బాలాలయంలో, బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం రామ్మూర్తినగర్‌లో ఉన్న యాగశాల వరకు శోభాయాత్ర నిర్వహించారు. యాగశాల వద్ద ఏర్పాటు చేసిన సభలో పండితులు భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. అనంతరం విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ నెల 20వ తేదీ వరకు పూజలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త నాగుబండి రంగనాథ్ తెలిపారు. కార్యక్రమంలో విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహణ కమిటీ సభ్యులు వెంకటనారాయణ నారాయణరావు, పందిరి సత్యనారాయణ, కృష్ణయ్య, మధు, నాగయ్య, దమయంతి పాల్గొన్నారు.

కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

హుజూర్‌నగర్, మార్చి 16: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రం కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుచేయడంపై ఆ సంఘం రాష్ట్ర నాయకులు కోట సూర్యప్రకాశ్‌రావు, అట్లూరి హరిబాబు, శాఖమూరి రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకాచౌదరి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్ కేఎల్ఎన్‌రావు, సురేష్, మట్టపల్లిరావు, జనార్దన్ రావు, సత్యనారాయణ, వాసుదేవరావు, హరిప్రసాద్, కోటా రమేష్, పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

అర్వపల్లి, ఆత్మకూర్(ఎస్), మార్చి 16: టిప్పర్ ఢీకొట్టడంతో మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన తండ్రీకుమారులు గద్దగూటి జానయ్య, విఘ్నేష్ ఈనెల 8న మృతి చెందారు. జానయ్య కుటుంబ సభ్యులకు ఆయన స్నేహితులు శనివారం రూ.77వేలను ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో సుల్తాన్, కిరణ్, విజయ్‌గౌడ్, సతీష్‌సిల్వర్, వెంకటేశ్వర్లు, వీరయ్య, నాగమణి పాల్గొన్నారు.

● ఆత్మకూర్(ఎస్ మండలంలోని ఏపూర్ గ్రామశాఖ బీఆర్ఎస్ నాయకుడు కోడూరు ఎల్లయ్య గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి ఏపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు శనివారం రూ.18వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు షేక్ బషీరుద్దీన్, మాజీ సర్పంచ్ రజిత,'ఎంపీటీసీమంజుల, వీరబోయిన నాగయ్య పాల్గొన్నారు.

'దర్గాలో విధులు నిర్వహించుకునేలా సహకరించాలి'

సూర్యాపేటటౌన్, మార్చి 16: హైకోర్టు తీర్పు అనుసరించి జాన్‌పహాడ్ దర్గాలో ముతవల్లిలు విధులు నిర్వహించుకునేలా అధికారులు సహకరించాలని దర్గా ముతవలిల వారసులు మహమ్మద్ గులాం రసూల్, మహ్మద్ అబ్దుల్ హన్నన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 400సంవత్సరాల చరిత్ర గలిగిన జాన్‌పహాడ్ దర్గాలో తమ పూర్వీకులు ముతవలిలుగా విధులు నిర్వహించారన్నారు. దర్గాను వక్ఫ్ బోర్డు 30ఏళ్ల క్రితం స్వాధీనం చేసుకుని, తమను దర్గాలోకి అనుమతించకపోవడంతో కోర్టును ఆశ్రయించామన్నారు. ముతవలిలుగా తమను నిర్ధారిస్తూ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందన్నారు. ముతవలిగా మహ్మద్ హస్సేన్ కొనసాగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మహ్మద్ అలీ, హస్సేన్, ఖలేద్, అబ్దుల్ హైకతిరి పాల్గొన్నారు.

బూరుగడ్డ దేవాలయ నూతన కమిటీ

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 16: మండలంలోని బూరుగడ్డ గ్రామంలో ఉన్న శ్రీఆదివరహలక్ష్మీనర్సింహవేణుగోపాలస్వామి దేవాలయానికి ప్రభుత్వం నూతన కమిటీని నియమించింది. ఏప్రిల్ 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు వేణుగోపాల స్వామి దేవాలయంలో ఉత్సవాలు, కల్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీని ఏర్పాటుచేస్తూ ఎండోమెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.ఉత్సవ కమిటీ సభ్యులుగా బూరుగడ్డకు చెందిన యరగాని భిక్షం, నర్సింహారావు, గురవయ్య, బత్తిని వీరబాబు, పాతబోయిన గంగయ్య, వేముల నర్సింహ, మేరిగ కవిత, అర్చకుడు ముడుంబై హరీష్‌కుమారాచార్యులును నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ గూడెపు శ్రీనివాసు, యరగాని నాగన్నగౌడ్, సుబ్బారావు, అరుణ్‌కుమార్, వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

మాదిగలను మోసం చేస్తున్న బీజేపీ: రవి

సూర్యాపేట టౌన్, మార్చి 16: ఎస్సీ వర్గీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం మాదిగల మోసం చేస్తోందని తెలంగాణ మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్‌క్లబ్‌లో నిర్వహించే మాదిగ సమ్మేళన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కొండమీది గోవిందరావు, బొజ్జ ఏడ్వర్డ్, జఫానియా, సంజయ్ పాల్గొన్నారు.

కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలి

సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 16: జిల్లాలో గ్యాస్ వినియోగదారులు కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్. లత అన్నారు. శ కలెక్టరేట్‌లో గ్యాస్ డీలర్స్, సంబంధిత శాఖల అదికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వ్యాపారులు కమర్షియల్ సిలిండర్ మాత్రమే వినియోగించాలని సూచించారు సమావేశంలో డీఎస్‌వో మోహన్‌బాబు, అసోసియేషన్ అద్యక్షురాలు కోటేశ్వరీ,వివిధ కంపినీల గ్యాస్ డీలర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కాంగ్రెస్‌తోనే సాధ్యం



తుంగతుర్తిలో అంబేడ్కర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేలు

తుంగతుర్తి, మార్చి 16: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలో రూ.కోటితో నిర్మించిన అంబేడ్కర్ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా హక్కులు, రిజర్వేషన్లు కల్పించి దళితుల అభ్యున్నతికి అంబేడ్కర్ కృషిచేశారని కొనియాడారు. అంబేడ్కర్ భవనంలో చిన్న, చిన్న కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి వంట గదులు నిర్మించాలని ఏఈ రాంబాబును ఆదేశించారు. అనంతరం పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలిన కేజీబీవీ విద్యార్థులు కోరగా, సానుకూలంగా ఎమ్మెల్యే స్పందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణారెడ్డి, ఎంఈవో భీంసింగ్, పీఆర్‌డీఈ కొండయ్య, ఏఈ రాంబాబు, దొంగరి గోవర్ధన్, ఓరుగంటి సత్యనారాయణ, కిషన్‌రావు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుడి కుటుంబానికి పరామర్శ

తిరుమలగిరి: తిరుమలగిరి మునిసిపాలిటీలో వాటర్‌మెన్‌గా పనిచేస్తున్న జంపాల యాదగిరి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సామేల్ పరామర్శించారు. యాదగిరి చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించి . కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. తిరుమలగిరిలో ఇటీవల మృతి చెందిన జయిని ఉపేంద్ర కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై.నరేష్ పాల్గొన్నారు.

స్థలం కేటాయించడం అభినందనీయం

హుజూర్‌నగర్, మార్చి 16: పట్టణంలో వివిధ కోర్టుల నిర్మాణానికి, న్యాయవాదులు గృహాల నిర్మాణానికి మూడు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించడం అభినందనీయమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు సముదాయం ఎదుట మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలానికి సంబంధించిన ధ్రువపత్రాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తికి అందించారన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, చల్లా కృష్ణయ్య, దీప్తి, రమాదేవి, సురేష్, నట్టె సత్యనారాయణ, బాలకృష్ణ, నవీన్, జుట్టుకొండ సత్యనారాయణ, కాలువ శ్రీనివాసు,శ్రీనివాసరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

మంత్రి ఉత్తమ్ చొరవతో సమస్య పరిష్కారం

ఆత్మకూర్(ఎస్): మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో తమ గ్రామంలోని విద్యుత్ లైన్ సమస్య పరిష్కారమైందని మండలంలోని ముక్కుడుదేవులపల్లి గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో ఇళ్లపై నుంచి, పాఠశాల మీదుగా 11కేవీ లైన్ వెళుతున్నందున తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని. మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి సహకారంతో మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకువెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. మంత్రి ఉత్తమ్ రూ.6 లక్షలను మంజూరు చేయించడంతో ఇళ్లపై నుంచి వెళుతున్న విద్యుత్ లైన్‌ను సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ వెంట మళ్లించే పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇరుగు మనీషా, మధుకర్, ఫాతిమా ఫయాజ్, మందడి రాఘవరెడ్డి, మల్లారెడ్డి, ఇరుగు లచ్చయ్య, వెంకన్న, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు ఆదుకోవాలి



రావిపహాడ్‌లో ఎండిన వరి పైరును పరిశీలిస్తున్న సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నాయకులు

మోతె, మార్చి 16: పంట నష్టపోయిన వరి రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.25వేల పరిహారం చెల్లించి ఆదుకోవాలనిసీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ కోరారు. శుక్రవారం మండంలోని రావిపహాడ్‌లో ఎండిపోయిన పైర్లను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, బొడ్డు శంకర్, కాకి మోహన్‌రెడ్డి, కిరణ్, మధు, కాశయ్య, కోట మధుసూదన్‌రెడ్డి, శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

రైతులకు లాభం చేకూరేలా శాస్త్రవేత్తలు పనిచేయాలి

గరిడేపల్లి, మార్చి 16: రైతులకు లాభం చేకూరేలా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయాలని పాలెం ప్రాంతీయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.మల్లారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగిన శాస్త్రీయ సలహా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వరికి ప్రత్యామ్నా యంగా ఆరుతడి పంటలపై ప్రోత్సాహం, సమగ్ర వ్యవసాయ విధానాలు ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కలిగించాలన్నారు. కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డి.నరేష్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరంలో కేవీకేలో చేపట్టే వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి జి.శ్రీధర్, ఉద్యాన, పట్టు విభాగం జిల్లా అధికారి టి.నాగయ్య, డీడీఎం నాబార్డు వి.జగన్, ఉద్యానవన అధికారి మల్లీశ్వరి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాంబాబు, శాస్త్రవేత్తలు నరేష్, ఏ.కిరణ్, డి.ఆదర్శ్, టి..మాధురి, ఎన్.సుగంధి, గ్రీన్‌క్రాస్ ఎన్జీవో ప్రోగ్రాం కోఆర్డినేటర్ శాస్త్రీయ సలహా సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.మల్లారెడ్డి

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం కార్యాలయంలో వరంగల్‌కు చెందిన మాక్సీ శరత్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దండ శ్యాంసుందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు తెలిపారు.



భానుపురి: సూర్యాపేట పట్టణంలోని జమ్మిగడ్డ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి 11గంటల వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ ఆర్.సురేష్ తెలిపారు.

పెన్‌పహాడ్: మండలంలో పదో తరగతి పరీక్షలు రాసే 11ఉన్నత పాఠశాలల 325 మంది విద్యార్థులకు పెన్‌పహాడ్ పీహెచ్‌సీ హెచ్‌ఈవో చంద్రశేఖర్‌రాజు పరీక్ష సామగ్రిని అందజేశారు. శనివారం మండల కేంద్రంలో చంద్రశేఖర్‌రాజును తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంఈవో నకిరేకంటి రవి, మండల నోడల్ ఆఫీసర్ వస్త్రాంనాయక్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రమీల, కస్తూర్బా ప్రిన్సిపాల్ ఆశాజమీన్‌బేగం, జమాల్ షరీఫ్, సంధ్యారాణి సన్మానించి అభినందించారు.

● ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు దొంగరి సైదులు అన్నారు. పెన్‌పహాడ్ మండలంలోని దూపహాడ్ గ్రామంలో 'ఉపాధి' నిధులు రూ.5లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలోవిజయ్‌కుమార్, కోటేశ్వర్‌రావు, కేశవులు, పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలోని గోవిందాపురంలో ఉన్న రామాలయం పునర్నిర్మాణం సందర్భంగా హోమం నిర్వహించారు. దేవతా విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ధనమ్మ, జైలు, ఇట్టిమళ్ళ శ్రీనివాస్, జ్యోతి, రంగాచార్యులు, బెంజిమెన్, రవి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: పట్టణంలోని 18వ వార్డులో నివసిస్తున్న నివాసం రాచకొండ పిచ్చయ్య కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు జక్కుల మల్లయ్య 50కిలోల బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఎండీ అజీజ్ పాషా, సమ్మెట సుబ్బరాజు, బంటు సైదులు,సైదులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: 'ఉపాధి' కూలీలకు 200రోజులు పనులు కల్పించి, రోజువారి కూలి రూ.600 ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రాయినిగూడెంలో 'ఉపాధి' కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వెంకన్న, నాగమణి పాల్గొన్నారు.

● గరిడేపల్లి మండలంలోని రాయినిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై బాలచంద్రకళ, నాగమణి అవగాహన కల్పించారు.

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీలక్ష్మీ నృసింహుని నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. 'భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

● మఠంపలి మండలంలోని పెదవీడు రెవెన్యూలోని సర్వే నెం. 540లో ఉన్న భూసమస్యను పరిష్కరించాలని కోరుతూ భూ పరిరక్షణ సమితి నాయకులు బాలాజీనాయక్, నరేదర్‌గౌడ్, బాలు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ మంగారాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు.

అనంతగిరి: పాలేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని గోండ్రియాల గ్రామ శివారులోని శనివారం పట్టుకున్నట్లు ఎస్ఐ నవీన్ తెలిపారు ట్రాక్టర్ డ్రైవర్ గోపి, యజమాని ఆదినారాయణలపై కేసు నమోదు చేశారు.

కోదాడ రూరల్, మద్దిరాల: కోదాడ మండలంలోని నల్లబండగూడెం, గుడిబండ, కాపుగల్లు, యర్రారం, గణపవరం గ్రామాల్లో పశువులకు శనివారం ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి నాగేంద్రబాబు డాక్టర్ సురేంద్ర, వెంకటేశ్వరరావు, ఖాన్, సాయికృష్ణ, శ్రీను, శరత్, హస్సేన్, రవి, గోపాలమిత్ర శ్రీను, ప్రసాద్, శ్రీనివాసాచారి, సైదులుపాల్గొన్నారు.

కోదాడ: అర్హులందరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కోదాడ పట్టణ సీఐ రాము కోరారు. పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సైదేశ్వరరావు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలోని కొమరబండ గ్రామంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించింది. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి, ఆనంద్‌నాయక్ పాల్గొన్నారు.

కోదాడ రూరల్: కోదాడ డిపో నుంచి బదిలీపై సూర్యాపేటకు వెళ్తున్న ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ బి.సైదులును డిపో మేనేజర్ శ్రీహర్ష సమక్షంలో ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అనంతరం సూర్యాపేట డిపో నుంచి బదిలీపై కోదాడకు వచ్చిన పి.నాగశ్రీకి స్వాగతం పలికారు.

అనంతగిరి: ఖమ్మం-కోదాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా శాంతినగర్ గ్రామంలో రోడ్ల వెంట ఇళ్లను ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ రవికుమార్, ఎస్ఐ నవీన్ ఆధ్వర్యంలో తొలగించారు

మునగాల రూరల్: మండలంలోని సీతానగరం గ్రామంలో ప్రభుత్వ స్కూల్‌లో ఉన్న బోరు పక్కనే మరో వ్యక్తి బోరు వేశాడని, ఆ బోరును సీజ్ చేయాలని ఆ గ్రామానికి చెందిన పలువురు గ్రామపంచాయతీ కార్యదర్శి శ్వేతకు వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందజేసినవారిలో పుల్లూరి దుర్గయ్య, పడిశాల లచ్చయ్య, వెంకులు, ఉపేందర్, శ్రీకాంత్, నాగరాజు, గురవయ్య, సురేష్, స్వామి, సింహాద్రి, వినయ్, సందీప్ ఉన్నారు.

నడిగూడెం: మండలంలోని కస్తూర్బా పాఠశాల నుంచి ప్రధాన రహదారి వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను జడ్పీటీసీ బానాల కవితనాగరాజు ప్రారంభించారు.కార్యక్రమంలో ఎంపీటీసీ గుండు శ్రీనివాస్, కాసాని వెంకన్న, విజయరామారావు, రాము, తిరుమల్లేష్ పాల్గొన్నారు.

● పౌష్టికాహారంపై నడిగూడెం సాయి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. పలు రకాల పదార్థాలు ఆకట్టుకున్నాయి.

మోతె: పదో తరగతి పరీక్షల కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటుచేయాలని తహసీల్దార్ కత్తుల సంఘమిత్ర అన్నారు. మోతె, మామిళ్లగూడెంలో నిర్వహించే పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో హరిసింగ్‌నాయక్, ఎంఈవో గోపాల్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

● పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మద్దిరాల మండల పశువైద్యాధికారి ఆసీఫా అన్నారు. మండలంలోని గోరెంట్ల గ్రామంలో టీకాలు వేసి ఆమె మాట్లాడారు.

మద్దిరాల: భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నూతన కమిటీని శనివారం మద్దిరాల మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గంట నాగయ్య తెలిపారు. మండల కమిటీ అధ్యక్షుడిగా మరికంటి ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా బరపటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సుంచు గోపయ్య, మాతంగి ఉప్పలయ్య, కార్యదర్శులుగా రామకృష్ణ, బరపటి వెంకటయ్య, కోశాధికారిగా పడిశాల నాగరాజు, గౌరవ సభ్యులుగా అక్బర్, నాగెల్లి వెంకన్న, మీసాల రాములు, తునికి లింగయ్య, సతీష్, చెడిపాక రాంబాబు, కిరణ్‌ను ఎన్నుకున్నారు.

చిలుకూరు: నిబంధనల మేరకు గ్రామాల్లో ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలని ఎంపీడీవో గిరిబాబు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సంఘ బంధం అధికారులు, పాఠశాల హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం దుర్గాప్రసాద్, ఎంపీవో ఇబ్రహీం పాల్గొన్నారు.

నూతన్‌కల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసే అమ్మ ఆదర్శ పాలక కమిటీలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఎంఈవో రాములు నాయక్ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఏపీఎం కరుణాకర్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.